క్లుప్తంగా

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 27, 28 తేదీల్లో గన్నవరం నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు జరుగుతాయని నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జ్ సీహెచ్. చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన బాలబాలికలు పాల్గొంటారని వివరించారు. ఈ పోటీలను విజయవంతం చేసేందుకు వ్యాయామ విద్య ఉపాధ్యాయులందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.

ఉత్సాహంగా మండల స్థాయి ఆటల పోటీలు



పెనమలూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు వణుకూరు జెడ్పీ పాఠశాలలో గురువారం ఉత్సాహంగా జరిగాయి. కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్, చెస్, యోగలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత గోపి, సర్పంచ్ రఘురాం, పీడీ కె.సురేష్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు గ్రామాల వీఆర్వోలు బదిలీ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసాదంపాడు సచివాలయం–1 వీఆర్వో మాడపాటి వెంకటనాగ చక్రధరరావు కొత్తూరు తాడేపల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు గ్రామం నుంచి సర్నాల మురళీకృష్ణ నియమితులయ్యారు. ప్రసాదంపాడు సచివాలయం–2 వీఆర్వో జి.దుర్గారావు గొల్లపూడి బదిలీ అవగా, ఈ స్థానంలో ఎనికేపాడు నుంచి పవన్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎనికేపాడుకు పైడూరుపాడు నుంచి సత్యవతి వీఆర్వోగా రానున్నారు. రామవరప్పాడు సచివాలయం–2కు సయ్యద్ బాజీ వీఆర్వోగా బదిలీపై రానున్నారు. నిడమానూరు శివారు గ్రామం దోనే ఆత్కూరులో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న అన్నపూర్ణ గన్నవరం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గన్నవరం మండలం నుంచి ఏసుబాబు బాధ్యతలు స్వీకరించనున్నారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయం



ఉయ్యూరు: కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో సుపరిపాలన అందించిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని చిన ఓగిరాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో బోడె ప్రసాద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 100 రోజుల్లో రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. విపత్తుల్లో ప్రజలకు అండగా నిలిచి వరద సాయం అందించేందుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెనిగళ్ల శిరీష, తహసీల్దార్ సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు వెనిగళ్ల కుటుంబయ్య, జనసేన పెనమలూరు ఇన్‌చార్జి ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో వ్యాపారవేత్త వల్లభనేని భూషయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: శాస్త్ర, సాంకేతిక విషయాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్ శాస్త్రజ్ఞులను తీర్చిదిద్దవచ్చని బాపులపాడు ఎంఈఓ–2 బి.సురేష్ కుమార్ అన్నారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సహకారంతో విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించేందుకు 'విభా' సంస్థతో కలిసి బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 'స్పేస్ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో భారత్ అగ్రస్థానంలోకి దూసుకెళ్తోందని సురేష్‌కుమార్ అన్నారు. భవిష్యత్ తరాలు జీవనవిధానం పూర్తిగా శాస్త్ర సాంకేతిక అంశాలపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. బస్సులో ఏర్పాటు చేసిన రాకెట్ నమూనాలు, అంతరిక్ష అంశాలపై వీడియో ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.దుర్గాప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు పద్మ, ఉషాకుమారి, శ్రీనివాసరావు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

కానూరులో చెత్త సమస్య





కానూరులో రహదారుల పక్కన చెత్త కుండీల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

- పేరుకున్న వ్యర్థాలతో పారిశుద్ధ్య లోపం
- బహిరంగ ప్రాంతాల్లో చెత్త కుప్పలు

పెనమలూరు: మండలంలోని కానూరును చెత్త సమస్య తీవ్రంగా వేధిస్తోంది. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ వ్యర్థాల కారణంగా గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. కానూరు గ్రామాన్ని వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీలో విలీనం చేశారు. ఈ గ్రామంలో దాదాపు 70 వేల మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామం నలుమూలలా విస్తరించటంతో నివాసాలు భారీ సంఖ్యలో ఏర్పడ్డాయి. ప్రధానంగా అపార్టుమెంట్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. అపార్టుమెంట్లు పెరగడంతో గ్రామ జనాభా కూడా అధికమవుతోంది. నివాసాల నుంచి వచ్చే వ్యర్థాలను స్థానికులు తమ నివాస ప్రాంతాల్లో రోడ్ల పక్కన పడేస్తున్నారు. టన్నుల కొద్దీ చెత్తను రోజూ రోడ్ల పక్కనే పడేస్తున్నారు. దీంతో గ్రామంలో ఎటు చూసినా వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఆ కుప్పలను తొలగించడం పెను సమస్యగా మారింది.

పారిశుద్ధ్య లోపం

గ్రామంలో చెత్త కుప్పల కారణంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ప్రధాన రహదారుల వెంట వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. మునిసిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో చెత్త కుప్పలను తొలగించకపోవటంతో గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. ఈ వ్యర్థాల కారణంగా ఈగలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో డ్రెయిన్లు సరిగా లేకపోవడం, ఉన్న మురుగు కాలువలు పూడిపోవడంతో మురుగు సమస్య తాండవిస్తోంది. డ్రెయిన్లు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. రాత్రి అయితే దోమలు జనాలపై దాడి చేస్తున్నాయి. ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి కనబడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

చెత్తకుండీలు ఉన్నా..

గ్రామంలో అనేక ప్రాంతాల్లో మునిసిపాలిటీ చెత్త కుండీలను ఏర్పాటు చేసింది. గ్రామస్తులు తమ ఇళ్లలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తీసుకొచ్చి ఈ కుండీల్లో వేయాల్సి ఉంది. అయితే చాలా మంది చెత్తకుండీల్లో చెత్త వేయకుండా నిర్లక్ష్యంగా వాటి పక్కనే పడేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది కూడా చెత్తకుండీల పక్కనే ఉంటున్న చెత్తను ఎత్తి కుండీల్లో వేయటం లేదు. దీంతో రోజుల తరబడి చెత్త కుప్పలు రోడ్డు పక్కనే దర్శనమిస్తున్నాయి. ఈ వ్యర్థాల కారణంగా పారిశుద్ధ్యం క్షీణించి, గ్రామంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది.

చెత్త సమస్యను పరిష్కరించాలి



గ్రామంలో రహదారుల పక్కనే ఉంటున్న చెత్త కుప్పల సమస్యను మునిసిపాలిటీ అధికారులు పరిష్కరించాలి. చెత్త కుప్పల నుంచి తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ఎండీ.అఖిల్‌షరీఫ్, కానూరు

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ఉంగుటూరు: ప్రధాన మంత్రి ఆవస యోజన లబ్ధిదారులు అందరూ తమ ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే మార్చి నాటికి పూర్తి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి, మండల హౌసింగ్ ప్రత్యేక అధికారి తాహెరా సుల్తానా సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో 'మన ఇల్లు – మన గౌరవం' కార్యక్రమంపై గురువారం మండలంలోని అధికారులు, హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ.. స్థలం పొందిన లబ్ధిదారులందరూ తమ గృహాలను త్వరిగతిన పూర్తి చేసుకోవాలన్నారు. మార్చి 2025 తరువాత ప్రభుత్వం బిల్లులు చెల్లించబోదని స్పష్టంచేశారు. ప్రధాన మంత్రి ఆవస యోజన 2.0కు అర్హులు కారని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీన లబ్ధిదారులకు లేఅవుట్ల వద్ద అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. బిల్లులు ఎప్పటికప్పుడు వేస్తున్నారని త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ బసవయ్య, ఎంఈఓ–1 రవికుమార్, ఎంఈఓ–2 సంబశివరావు, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీఓ వినీల, ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.



ఉంగుటూరులో మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

క్రీడలతో మానసిక ఉల్లాసం

కంకిపాడు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ–1 శేషగిరిరావు, ఎంఈఓ–2 కె.ప్రసాద్ అన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. పోటీలను ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్ అస్గర్ షరీఫ్ ప్రారంభించారు. అండర్–14, అండర్–17 బాలికలు, బాలుర విభాగాల్లో పోటీలు జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్–14 బాలుర విభాగంలో షటిల్ బ్యాడ్మింటన్‌లో పునాదిపాడు శ్రీచైతన్య విన్నర్స్‌గా, జెడ్పీహెచ్‌ఎస్ తెన్నేరు రన్నర్ నిలిచాయి. బాలికల విభాగంలో శ్రీ చైతన్య పునాదిపాడు విన్నర్స్‌గా, జెడ్పీ పాఠశాల కంకిపాడు రన్నర్స్, అండర్–17 బాలుర విభాగంలో శ్రీ చైతన్య పునాదిపాడు విన్నర్స్‌గా, జెడ్పీ కోలవెన్ను రన్నర్స్‌గా, బాలికల విభాగంలో శ్రీ చైతన్య పునాదిపాడు విన్నర్స్‌గా, జెడ్పీహెచ్‌ఎస్ ప్రొద్దుటూరు రన్నర్స్‌గా నిలిచాయి. పోటీలను హెచ్‌ఎం జి.బి.కె. సుధారాణి, పీడీలు ఎం.హరిగోపాల్, ఎల్.దుర్గాప్రసాద్ పర్యవేక్షించారు.



నియోజకవర్గ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కంకిపాడు విద్యాశాఖ అధికారులు, పీఈటీలు

గౌడవర్రులో బ్యానర్ రగడ

కంకిపాడు: బ్యానర్ ఏర్పాటు వివాదమైంది. టీడీపీ శ్రేణులు ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా వ్యవహరించాయి. గౌడవర్రు గ్రామంలోకి వెళ్లే ప్రధాన మలుపు వద్ద ఎన్నో సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ శ్రేణులు బ్యానర్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ నెల 27న ఎన్టీఆర్ చిత్రం విడుదల సందర్భంగా పార్టీలోని ఆయన అభిమానులు బ్యానర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బ్యానర్‌ను స్థానికులు కొందరు అదే ప్రాంతంలో వైఎస్సార్ సీపీ నేతల అనుమతితో ఏర్పాటుచేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎన్టీఆర్ బ్యానర్ ఏర్పాటుచేసుకునే క్రమంలో అక్కడ ఉన్న జనసేన బ్యానర్‌ను తొలగించాలని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సూచించారు. టీడీపీ శ్రేణులు ఆ ప్రాంతానికి భారీగా చేరుకుని బ్యానర్ తీసేదిలేదంటూ భీష్మించాయి. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పక్షాల కార్యకర్తలు భారీగా చేరుకోవటంతో తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇరుపక్షాలను వారించే ప్రయత్నం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సంయమనంతో సమాధానమిస్తున్నా టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు తెగబడ్డాయి. అధికార హంగుతో రెచ్చిపోయాయి. ఒకానొక దశలో పరిస్థితి అదుపుతప్పింది. దీంతో బ్యానర్ తొలగించేలా చేస్తామని చెప్పి ఇరుపక్షాలను అక్కడి నుంచి పోలీసులు పంపించివేశారు. గురువారం జనసేన, టీడీపీ నేతల ఫొటోలతో ఎన్టీఆర్ చిత్రం విడుదల సందర్భంగా బ్యానర్‌ను ఆ పార్టీల శ్రేణులు అదే ప్రదేశంలో ఏర్పాటుచేసి ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యకు పాల్పడ్డారు. పోలీసుల సమక్షంలో ఆ పార్టీ నేతలు బ్యానర్ కట్టారు. పోలీసులు అక్కడే బ్యానర్‌కు కాపలాకాస్తూ విధులు నిర్వహిస్తున్నారు. అధికారం ఉందని ఆ పార్టీల కార్యకర్తలు ఇలా వ్యవహరిస్తున్నారని, అర్థం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులకు పోలీసులు సూచించటం కొసమెరుపు.



టీడీపీ, జనసేన నేతల ఫొటోలతో ఏర్పాటు చేసిన బ్యానర్ వద్ద గస్తీ కాస్తున్న పోలీసులు

బదిలీపై వచ్చిన వీఆర్వోలు

పెనమలూరు: మండలంలోని పలు గ్రామాల వీఆర్వోలు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తగా వీఆర్వోలు బదిలీపై వచ్చారు. కానూరు–3కి ఎం.మంగరాజు, కానూరు–5కు ఎం.నీలాంబరం, తాడిగడప–1కు పద్మావతి, తాడిగడప–2కు కె.శివపార్వతి, యనమలకుదురు–4కు ఎం.వి.ఎల్.ఎస్.లక్ష్మి, యనమలకుదురు–5కు జె.ప్రభాకరరావు, గంగూరుకు బి.కోటేశ్వరరావు, సీహెచ్‌ఎస్ఎస్.ప్రసాద్, చోడవరానికి వి.వి.రాజు బదిలీపై వచ్చారు. వారు విధుల్లో చేరాల్సి ఉంది.

మండల పరిషత్ అధికారులు బదిలీ

పెనమలూరు: మండల పరిషత్ కార్యాలయం అధికారులు పలువురు బదిలీ అయ్యారు. ఎంపీడీఓ సునీతా శర్మ ఇబ్రహీంపట్నం బదిలీ అయ్యారు. ఏలూరు రూరల్‌లో పనిచేస్తున్న ఎంపీడీఓ ప్రణవిని కృష్ణా జిల్లా పరిషత్‌కు సరెండర్ చేయగా ఆమెను పెనమలూరు ఎంపీడీఓగా నియమించనున్నారు. ఏఓ లోయ శివశంకర్ రావును ఉయ్యూరుకు, ఇబ్రహీంపట్నం ఏఓ ఓంకార్‌ను పెనమలూరు ఏఓగా బదిలీచేశారు. టైపిస్టు నాగేంద్రను కంకిపాడు బదిలీ చేయగా, ఆయన స్థానంలో కంకిపాడు నుంచి సుగుణామణిని నియమించారు. సబార్డినేట్‌గా పని చేస్తున్న మల్లేశ్వరిని విజయవాడ రూరల్‌కు బదిలీ చేశారు. వచ్చే నెల పింఛన్ల పంపిణీ తరువాత అధికారులు రిలీవ్ అవుతారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా ఉన్న శ్రీనివాస్ కంకిపాడుకు బదిలీ అయ్యారు. రీసర్వే డీటీ అనీల్ పెడనకు బదిలీ అయ్యారు. ఎలక్షన్ డీటీ భవాని పెనమలూరులోనే రెగ్యులర్ డీటీగా నియమించగా ఆమె స్థానంలో ఫారిన్ సర్వీస్ నుంచి డీటీగా బదిలీపై రాజు వచ్చారు.

ఎడ్లంక వరద బాధితులకు రెహబాత్ మినిస్ట్రీస్ సహాయం



ఎడ్లంక(అవనిగడ్డ): ఉయ్యూరుకు చెందిన రెహబాత్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు మీసాల కాంతారావు ఆధ్వర్యంలో ఎడ్లంక వరద బాధితులకు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గ్రామంలోని 400 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, వంటనూనె పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలెపు సామ్రాజ్యం, మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు, మునిపల్లి వెంకటేశ్వరరావు, పాస్టర్లు ఎం.రత్నరాజు, కరుణాకర శాస్త్రి, కన్నా నాగబసవయ్య, ఇస్సాకుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్




ఉయ్యూరు: స్థానిక జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు గురువారం ఉత్సాహంగా ముగిశాయి. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాల, బాలికలకు ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగ, చెస్ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈఓ–2 సుధారాణి ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. ప్రతిభావంతులైన క్రీడాకారులు మండల స్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి జి.వి.రమణ తెలిపారు. పెనమలూరు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోత్స్నాదేవి, విద్యాకమిటీ చైర్మన్ ఆరేపల్లి శివ సాయిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

52 మందికి వైద్య సేవలు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో గురువారం 104 వాహన సిబ్బంది గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. సచివాలయం–2 వద్ద సీహెచ్‌ఓ అంజలి ఆధ్వర్యంలో దీర్ఘకాల రోగులు 52 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అనిత, ఆశాలు సేవలందించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక పూర్తి



ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపికైన విద్యార్థులతో లెఫ్టినెంట్ కల్నల్ పాండే

ఉయ్యూరు: ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక గురువారం పూర్తయింది. ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరానికి ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. 17వ ఆంధ్రాబెటాలియన్ సీఓ లెఫ్టినెంట్ కల్నల్ జేసీ పాండే, సుబేదార్ మేజర్ మహేంద్రసింగ్, సుబేదార్ పి.రమణ, క్యాడెట్లకు దేహదారుఢ పరీక్షలు, మౌఖిక, రాత పరీక్షలు నిర్వహించి క్యాడెట్లను ఎంపిక చేశారు. 22 మంది బాలికలు, 36 మంది బాలురు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శివనాథ్ తెలిపారు.

రైతులకు నష్టపరిహారం విడుదల

పెనమలూరు: మండలంలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉన్న యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. పోరంకి, కానూరు, తాడిగడప, వణుకూరు గ్రామాల్లో డ్రెయిన్లు సరిగా లేక పల్లపు పొలాలు నీట మునిగాయి. దీంతో అధికారులు పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. వరి సాగుచేసిన రైతులు 394 మంది, చెరకు రైతులు 27 మంది, మొక్కజొన్న రైతులు నలుగురు, మినుము రైతులు ముగ్గురు నష్టపోయారని గుర్తించి వివరాలు నమోదు చేశారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారాన్ని రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసింది.

గృహాలకూ రూ.10 వేలే

కృష్ణానది వరదల కారణంగా నీట మునిగిన గృహాలకు కూడా ప్రభుత్వం నష్టపరిహారం సొమ్ము విడుదల చేసింది. ఒకో గృహానికి రూ.10 వేల చొప్పునే ఇచ్చింది. విజయవాడలో ఇంటికి రూ.25 వేలు ఇస్తుండగా, పెనమలూరు మండలంలో రూ.10 వేలే ఇవ్వడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలో ఒక రకంగా తమకు మరో రకంగా నష్టపరిహారం ఎలా లెక్క కట్టి ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. మొత్తం 2,610 మంది గృహ యజమానులకు నిరాశే మిగిలింది.

రూ.1.4 కోట్లతో నున్న అభివృద్ధి ప్రణాళిక

విజయవాడరూరల్: మండలంలోని నున్న గ్రామంలో రానున్న ఐదేళ్లలో రూ.1.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి జి.టి.వి.రమణ తెలిపారు. సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. పంచాయతీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, జాతీయ ఉపాధి నిధులు కలిపి రూ.1.4 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ ఏడాది చేపట్టాల్సిన పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గడిచిన ఐదేళ్లల్లో గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల వివరాలను సర్పంచి సరళ వెల్లడించారు. 2047 స్వర్ణాంధ్ర, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం, ఇది మంచి ప్రభుత్వం మూడు అంశాలపై గ్రామసభ నిర్వహించగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై గ్రామసభలో చర్చించారు. అధికారులు పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. వికాస్ కాలేజీ రోడ్డులో చినకంచి వద్ద చప్టాపై వంతెన నిర్మించాలని ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, వార్డు సభ్యుడు ప్రత్తిపాటి సుందరయ్య కార్యదర్శికి వినతి అందజేశారు. ఈ ప్రతిపాదనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. గ్రామంలో ఇంటి పన్నుల విధింపు సక్రమంగా లేదని జనసేన పార్టీ నాయకుడు లేళ్ల వేణు గ్రామసభలో ప్రస్తావించారు. రేకుల షెడ్డులో ఉంటున్న తనకు, తన ఇంటి పక్కనున్న మూడంతుస్తుల భవనానికి పెద్ద తేడా లేకుండా ఇంటి పన్ను విధించారని పేర్కొన్నారు. గ్రామంలో ఈ విధంగా చాలా జరిగినట్లు ఆయన ఆరోపించారు. దీనిపై స్పందించిన కార్యదర్శి రమణ స్పందిస్తూ.. ఇంటిపన్నుపై ఎలాంటి అనుమానాలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటిని నివృత్తి చేసి సరిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సభలో ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కేసరపల్లిలో సామూహిక సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి



గన్నవరం మాసోత్సవాల్లో పాల్గొన్న సిబ్బంది, తల్లులు

గన్నవరం: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని కేసరపల్లి సర్పంచి చేబ్రోలు లక్ష్మీ మౌనిక సూచించారు. మండలంలోని కేసరపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గన్నవరం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా జరిగిన అవగాహన సదస్సులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్. నాగపద్మావతి మాట్లాడుతూ.. ఆకుకూరలు, మునగ ఆకు, జామ, బొప్పాయి, చిక్కీలు, బెల్లం వంటి ఆహార పదార్థాల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జి.శివకుమారి, బి.జ్యోతి, జి.పెర్సీ, పి.భవాని, వి.రాణి, ఐ.మీనా, వి.లక్ష్మీదేవి, బి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

విజయవాడరూరల్: ప్రజాసంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాతపాడు వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్థులు కొత్త పెన్షన్లు మంజూరుపై ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చాక అర్హులు దరఖాస్తు చేసుకునే వీలుంటుందన్నారు. అప్పారావుపేట, వెంకటాపురం, నైనవరం గ్రామాల్లో అంతరత్ర రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని ప్రజలు కోరారు. పాతపాడులో వేదికపైకి తమను ఆహ్వానించలేదని టీడీపీ నాయకులు హడావుడీ చేశారు. వరదల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వెంకట్రావు పేర్కొన్నారు. తమకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందలేదని అంబాపురంలో అనేక మంది బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రెండు, మూడు రోజుల్లో అందరికీ సాయం అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచి దేవగిరి సుజాత, మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, నైనవరం మాజీ సర్పంచి దావు కోటేశ్వరరావు, అంబాపురం సర్పంచి గండికోట సీతయ్య, తహసీల్దారు బి.సుగుణ, ఎంపీడీఓ భార్గవి, ఈఓఆర్డీ ఎం.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పాతపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

కార్మికవాడ అభివృద్ధికి కృషిచేస్తా

ఏటీపీ నూతన అధ్యక్షుడు రాజనాల

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడ అభివృద్ధితో పాటు కార్మికుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఆటోమొబైల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు అన్నారు. స్థానిక ఏటీపీ హాలులో ఏటీపీ నూతన అధ్యక్షుడు, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏటీపీకు వరుసగా నాల్గో సారి అధ్యక్షుడిగా రాజనాల ఎన్నిక కావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఆటోనగర్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టి కార్మికవాడ సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతోపాటు రహదారుల అభివృద్ధి జరగాలన్నారు. అంతకు ముందు ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, కార్యదర్శి రావి రామచంద్రారావు, కోశాధికారిగా సయ్యద్ షా సాహెబ్ హుస్సేన్ (బాబా), ఉపాధ్యక్షులుగా అర్జా సత్యనారాయణ, మిగిలిన కార్యవర్గంతో ఎన్నికల అధికారి బాయన వెంకట్రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామమోహన్, ఐలా మాజీ పాలకవర్గ సభ్యులు ఎస్.దుర్గాప్రసాద్, అన్నే శివనాగేశ్వరరావు, కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత డాక్టర్ అబ్దుల్ కలాం, శ్రీనివాసరెడ్డి, దోనె శ్రీనివాసరావు, నెల్లి వెంకటేశ్వరరావు, ఎండీ రిజ్వాన్ పాల్గొన్నారు. కార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అభినందించారు.



ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావును అభినందిస్తున్న మల్లాది విష్ణు